క్లుప్తంగా

నియామకం


రాజ్‌కుమార్

చిల్పూరు: జాతీయ చేనేత ఐక్య వేదిక సంఘం జిల్లా కార్యవర్గ సభ్యుడిగా మండలంలోని మల్కాపూర్ గ్రామానికి చెందిన బండారి రాజ్‌కుమార్‌ను నియమించినట్లు జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్, రాష్ట్ర అధ్యక్షుడు మోడ రాజు గురువారం ప్రకటించారు. ఈసందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతూ చేనేత కార్మికులు, పద్మశాలీలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకొని సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం అయ్యేలా కృషిచేస్తానని అన్నారు.


బండా ప్రకాశ్‌ను కలిసిన మదిరాజ్ నాయకులు

చిల్పూరు: ముదిరాజ్, మత్స్యకార్మికుల సమస్యలను పరిష్కరించాలని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్‌ను గురువారం మండల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి విన్నవించారు. ఈ సందర్భంగా సంఘం సొసైటీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుర్రపు వెంకటేశ్వర్లు, మండల అధ్యక్షుడు జంగిటి కుమార్ మాట్లాడుతూ ముదిరాజ్, మత్స్య కార్మిక కుటుంబాల్లో పేద వారు ఉన్నందున వారికి బీసీబంధు పథకం అందేలా చూడాలని కోరగా, సానుకూలంగా స్పందించారని తెలిపారు.

పరామర్శ

పాలకుర్తి: అనారోగ్యానికి గురై చికిత్స పొందుతున్న పాలకుర్తి మాజీ ఎంపీటీసీ సభ్యుడు కమ్మగాని పరమేశ్వర్‌ను మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు గురువారం ఆస్పత్రిలో పరామర్శించారు. శ్రీనివాసరావు, రాంబాబు, ఎల్లయ్య, కమ్మగాని నాగన్న ఉన్నారు.

గుండెపోటుతో యువరైతు మృతి


నిమ్మ రాజు (ఫైల్)

స్టేషన్‌ఘన్‌పూర్: పొలంలో ట్రాక్టర్‌తో నారు మడి దున్నుతుండగా నిమ్మ రాజు (కొండల్) (27) అనే రైతు ఒక్కసారిగా గుండెపోటుతో మృతిచెందిన సంఘటన మండలంలోని నమిలిగొండలో గురువారం సాయంత్రం జరిగింది. వివరాలు ఇలా ఉన్నాయి. నమిలిగొండ గ్రామానికి చెందిన నిమ్మ వెంకట్‌రెడ్డి, నవీనమ్మ దంపతులకు ఒక కుమారుడు, ఒక కుమార్తె కాగా కుమార్తెకు వివాహం జరిగింది. కుమారుడు తల్లిదండ్రులతో ఉంటూ వ్యవసాయం చేస్తున్నాడు. ఈ క్రమంలో గురువారం సాయంత్రం తమ వ్యవసాయ భూమి వద్ద ట్రాక్టర్‌తో పొలం దున్నుతుండగా ఒక్కసారిగా ఛాతిలో నొప్పి అంటూ ట్రాక్టర్ దిగి కింద పడిపోయాడు. అక్కడే ఉన్న తండ్రి వెంకట్‌రెడ్డి గమనించి పెద్దగా కేకలు వేస్తూ చుట్టుపక్కల వారిని పిలిచారు. వారి సహాయంతో చికిత్స నిమిత్తం ఘన్‌పూర్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలోనే మృతిచెందాడు. చేతికి అందివచ్చిన కుమారుడు కళ్లెదుటే మృతి చెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరుగా విలపించారు. యువరైతు మృతితో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

గుంతల రోడ్డును బాగు చేయించండి



జనగామ: పట్టణంలోని 4వ వార్డు సెయింట్ మెరీస్ 60 ఫీట్ల ప్రధాన రహదారిలో గుంతల మయంగా మారిన రోడ్డును బాగు చేయించాలని బీజేపీ జిల్లా ప్రచార కార్యదర్శి పెద్దోజు జగదీష్ డిమాండ్ చేశారు. గురువారం కాలనీవాసులతో కలిసి ఆయన రోడ్డును పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చిన్నపాటి వర్షానికే రోడ్డు పూర్తి మునిగి పోయిందన్నారు. దీంతో గుంతల్లో నీరు నిలిచిపోవడంతో స్కూల్ బస్సులతో పాటు బైక్‌లు, చిన్న పిల్లలు సైకిళ్లపై వస్తూ అందులో పడిపోతున్నారు. మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి, రోడ్డును బాగు చేయించాలన్నారు. కాలనీవాసులు ఓరుగంటి నాగభూషణం, మాశెట్టి నరేష్, శివకుమార్, దర్గయ్య ఉన్నారు.

గ్రామ సభల్లోనే 'డబుల్' ఇళ్ల ఎంపిక చేపట్టాలి

దేవరుప్పుల: మండల కేంద్రంలోని నిర్మించిన డబుల్‌బెడ్రూం ఇళ్లకు గ్రామ సభల ద్వారానే లబ్ధిదారుల ఎంపిక చేయాలని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది కృష్ణమూర్తి డిమాండ్ చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఆర్డీఓ పర్యవేక్షణలో తహసీల్దార్ ఆన్‌లైన్ దరఖాస్తులన్నింటిని నిశితంగా పరిశీలించాకనే గ్రామసభలో జాబితా విడుదల చేసి సందేహాలు నివృత్తి అయ్యాక లబ్ధిదారులను ఎంపిక చేసే ప్రక్రియకు విఘాతం కల్పించవద్దన్నారు. గ్రామంలో వారం రోజుల ముందు దండోరా నిర్వహించిన అనంతరం గతంలో మాదిరిగా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక చేపట్టనట్టయితే కాంగ్రెస్ పక్షాన ఆందోళన అనివార్యమన్నారు.

రఘునాథపల్లిలో..



తరిగొప్పులలో..



జనగామరూరల్: సమ్మెలో కార్మికులు



కార్మికుల వినూత్న నిరసన

న్యాయమైన డిమాండ్ల సాధన కోసం జిల్లా వ్యాప్తంగా జీపీ కార్మికులు చేపట్టి నిరవధిక సమ్మె 8వ రోజు కొనసాగింది. సమ్మెలో భాగంగా గురువారం కళ్లకు గంతలు కట్టుకొని వినూత్న నిరసన చేపట్టారు. సమ్మెలో జిల్లా అధ్యక్షుడు గూడూరు భాస్కర్, సీఐటీయూ జీపీ విభాగం జిల్లా అధ్యక్షుడు బత్తిని వెంకన్న, ప్రధాన కార్యదర్శి రాపర్తి రాజు పాల్గొని మాట్లాడారు. పంచాయతీ కార్మికుల సమ్మె 8 రోజులు గడుస్తున్నా ప్రభుత్వం స్పందించపోవడం బాధాకరమని, తక్షణమే స్పందించి కార్మికుల సమస్యలను పరిష్కరించాలన్నారు. జీపీ సిబ్బందిని పర్మనెంట్ చేయాలని కోరారు.

– సాక్షి నెట్‌వర్క్


స్టేషన్‌ఘన్‌పూర్: సమ్మెలో కళ్లకు గంతలు కట్టుకొని నిరసన తెలుపుతున్న జీపీ కార్మికులు


కొడకండ్ల: సంఘీభావం తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు


దేవరుప్పులలో..


బచ్చన్నపేటలో..

ఉచిత 'లైసెన్స్'లను వినియోగించుకోవాలి


దరఖాస్తులను స్వీకరిస్తున్న నాయకులు

జనగామ: జిల్లా కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ మెంబర్ కొమ్మూరి ప్రతాప్‌రెడ్డి క్యాంపు కార్యాలయంలో కొమ్మూరి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత డ్రైవింగ్ లైసెన్స్ కోసం యువత దరఖాస్తు చేసుకున్నారు. జనగామ నియోజక వర్గంలో డ్రైవింగ్ వచ్చి లైసెన్స్ లేని యువకులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాల కోసం కొమ్మూరి వ్యక్తిగత కార్యదర్శి దాసరి క్రాంతి–7981111430, 9704899528 నంబర్లను సంప్రదించాలని కోరారు. జిల్లా నాయకులు సిద్దారెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బనుక శివరాజ్ యాదవ్, కిసాన్ సెల్ పట్టణ అధ్యక్షులు మోటె శ్రీనివాస్, లింగాల నర్సిరెడ్డి, పట్వారి శ్రీనివాస్, దాసరి శేఖర్, నియోజకవర్గ సోషల్ మీడియా కన్వీనర్ పిట్టల సతీష్, బండారు శ్రీనివాస్, జాయ మల్లేష్, గందమల్ల కమలాకర్, అర్షద్ రహమాన్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ న్యాయం చేస్తాం..


మాట్లాడుతున్న తహసీల్దార్ పూల్‌సింగ్‌చౌహాన్

స్టేషన్‌ఘన్‌పూర్: డబుల్ బెడ్రూం ఇళ్లు, ప్రభుత్వ ఇళ్ల స్థలాల పంపిణీ విషయమై గ్రామంలోని అర్హులందరికీ న్యాయం చేసేలా నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తామని ఘన్‌పూర్ తహసీల్దార్ పూల్‌సింగ్ చౌహాన్ అన్నారు. మండలంలోని నమిలిగొండ గ్రామానికి మంజూరైన 30 డబుల్‌బెడ్రూం ఇళ్లకు లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామంలో రెండో గ్రామసభను గురువారం నిర్వహించారు. సర్పంచ్ డ్యాగల ఉప్పలస్వామి అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్య అతిథిగా హాజరైన తహసీల్దార్ మాట్లాడారు. గ్రామానికి మొత్తం 30 ఇండ్లు మంజూరు కాగా దాదాపు 500కు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. మొత్తం 30ఇళ్లలో ఎస్సీ, ఎస్టీలకు 50 శాతం, మైనార్టీలకు 7 శాతం, మిగిలినవి బీసీలు, జనరల్‌కు అందిస్తారన్నారు. దరఖాస్తుల ఆధారంగా ఇంటింటా సర్వే చేపట్టి నిరుపేదలను మొత్తం 31 మందిని ఎంపిక చేశామని, మరోసారి నిర్వహించే గ్రామసభలో డ్రాపద్ధతిలో 30 మందిని ఎంపిక చేస్తామన్నారు. అదేవిధంగా గ్రామంలోని 175 సర్వే నంబర్‌లో ప్రభుత్వభూమిలో పేదలకు ఇళ్ల పట్టాలు అందించేందుకు గతంలో పట్టాలు పొందిన వారిని, ఇళ్లు లేని పేదలను మొత్తం 97 మందిని ఎంపిక చేశామన్నారు. ఇళ్లు, ఇళ్ల స్థలాలు రానివారు ఎవ్వరూ నిరాశ చెందవద్దన్నారు. అనంతరం ఆర్‌ఐ అర్జున్ లబ్ధిదారుల జాబితాలో పేర్లను సభలో చదివి వినిపించారు. కాగా, లబ్ధిదారుల జాబితాలో పేర్లు రాలేదని పలువురు ఆరోపించారు. సర్పంచ్ డ్యాగల ఉప్పలస్వామి, ఎంపీటీసీ పురమాని రజాక్‌యాదవ్, ఉపసర్పంచ్ రాంచంద్రం, ఆర్‌ఐలు అర్జున్, రవీందర్, పంచాయతీ కార్యదర్శి జేసుమణి, శ్రీధర్, వీఆర్‌ఏలు శ్రీను, రాము, అభి,యాదేష్ పాల్గొన్నారు.

'గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కరువు'

లింగాలఘణపురం: మండలంలోని పలు గ్రామాల్లో మౌలిక సదుపాయాలు కరువయ్యాయని ఆల్ ఇండియా ప్రొఫెషనల్ కాంగ్రెస్ నేత డాక్టర్ బొల్లెపల్లి కృష్ణ విమర్శించారు. గురువారం మండలంలోని క్లోంలో సమస్యలపై రెండోసారి పర్యటించారు. డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఏళ్లు గడుస్తున్నా పేదలకు పంపిణీ చేయడంలేదని, కిటికీలు, తలుపులు ధ్వంసమయ్యాయని, జీడికల్–క్లోం రోడ్డు గుంతల మయమైందని ఎవరూ పట్టించుకోవడంలేదన్నారు. నియోజకవర్గంలోని ఎమ్మెల్యే రాజయ్య, ఎమ్మెల్సీ కడియం శ్రీహరి ఒకొరినొకరు దూషించుకోవడంతోనే సరిపెట్టుకుంటున్నారని, అభివృద్ధిని మరిచారని అన్నారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపించి సంక్షేమానికి బాటలు వేయాలని కోరారు. కాంగ్రెస్ గ్రామశాఖ అధ్యక్షుడు శ్రీనివాసు, పీఏసీఎస్ డైరెక్టర్ మూర్తి, నాయకులు రమేష్, బాల్నె శేఖర్, మల్లయ్య, శంకరయ్య, ప్రసాద్, భాస్కర్, సంపత్ పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

స్వీపర్లకు కనీస వేతనం ఇవ్వాలి

జనగామ రూరల్: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న స్వీపర్లకు కనీస వేతనం ఇవ్వాలని కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో సాధన సమితి జాతీయ అధ్యక్షుడు జేరుపోతుల పరశురామ్ డిమాండ్ చేశారు. గురువారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ కార్యాలయం వద్ద నిర్వహిస్తున్న సమ్మె 15వ రోజు కొనసాగింది. ఈ సందర్భంగా దీక్షకు ఆయన మద్దతు తెలిపి మాట్లాడారు. పిడుగు ఆశ్వీరాదం, స్వీపర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు అంజయ్య, భాస్కర్, అయోధ్య, మల్లేషం, లాలు, రాములు, యాదయ్య, బద్రమ్మ, కళమ్మ, నర్సింగరావు, పర్షరాములు పాల్గొన్నారు.

దుస్తుల పంపిణీ

కొడకండ్ల: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు గురువారం ఏకరూప దుస్తులను పంపిణీ చేసినట్లు మండల నోడల్ ఆఫీసర్ గ్రేస్‌కేజియా రాణి తెలిపారు. సీఆర్‌పీలు జ్ఞానానందం, బాలాజీ, అనీల్‌కుమార్‌లు పాల్గొన్నారు.

నోట్ బుక్స్..

జనగామ రూరల్: లయన్స్ క్లబ్ ప్రతినిధి కందుకూరు వెంకట్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా గురువారం పట్టణంలోని వర్ధన్ ఆశ్రమంలో పేద విద్యార్థులకు నోట్ బుక్స్ పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరు తమకు తోచినసాయం చేయాలని కోరారు.

సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

జఫర్‌గఢ్: 24 గంటల ఉచిత విద్యుత్ పేరుతో రైతులను మోసం చేయడాన్ని నిరసిస్తూ ఎంపీటీసీ శిరభోయిన సంధ్య శ్రీనివాస్ ఆధ్వర్యంలో మండలంలోని కూనూర్ గ్రామంలో సబ్‌స్టేషన్ ఎదుట కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు కలిసి సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను గురువారం దహనం చేశారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు వ్యతిరేకంగా పెద్దపెట్టున నినాదాలు చేశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం చెప్పిన విధంగా రైతాంగానికి 24 గంటల నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను అందించడం లేదన్నారు. రైతులకు ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత కాంగ్రెస్‌దేనన్నారు. కాంగ్రెస్ గ్రామ నాయకులు దాట్ల ఆశోక్, వార్డు సభ్యులు సురేష్, వేముల స్వరూప, ఇల్లందుల సమ్మక్క కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

హ్యాండ్ రైటింగ్‌ను మెరుగుపర్చుకోవాలి



బచ్చన్నపేట: విద్యార్థులు తెలుగు, హిందీ, ఇంగ్లిష్ భాషల్లో హ్యాండ్‌రైటింగ్‌ను మెరుగుపర్చుకోవాలని చేతిరాత నిపుణుడు మంతపురి గణేష్ అన్నారు. గ్రంథాలయ వారోత్సవాలను పురస్కరించుకొని మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో హ్యాండ్‌రైటింగ్‌పై గణేష్ గురువారం విద్యార్థులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు అందమైన చేతిరాత ద్వారా ఆత్మ విశ్వాసం పెరుగుతుందన్నారు. అనంతరం గణేష్‌ను ఉపాధ్యాయులు సత్కరించారు.

చేయూత

పాలకుర్తి: గూడూరుకు చెందిన చెరిపెల్లి శృతి నీట్‌లో ఉత్తమ ర్యాంకును సాధించింది. కాగా, గురువారం ఆమె చదువు నిమిత్తం ఎన్‌ఆర్‌ఐ బొబ్బల రమణా రెడ్డి రూ. 10వేల ఆర్థికసాయం అందజేశారు. ఎంపీపీ నాగిరెడ్డి, అశోక్‌రెడ్డి, సర్పంచ్ అరుణ, ఐలోని పాల్గొన్నారు.

సన్మానం


హరీశ్‌ను సత్కరిస్తున్న అధికారులు

జనగామ: నల్లగొండ జిల్లాలో ఈనెల 11,12వ తేదీల్లో జరిగిన రాష్ట్ర స్థాయి ఎలక్ట్రిసిటీ షటిల్ బాడ్మింటన్ టోర్నమెంట్‌లో వరంగల్ జిల్లా ప్రథమ స్థానంలో నిలిచింది. జనగామలో విధులు నిర్వర్తిస్తున్న సబ్ ఇంజనీర్ బి.హరీశ్ వరంగల్ జట్టును ఛాంపియన్‌గా నిలబెట్టడంతో పాటు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికకు కారణమయ్యాడు. ఈ సందర్భంగా జిల్లా విద్యుత్ పర్యవేక్షణ అధికారి టి.వేణుమాధవ్, బి.హరీశ్‌ను సన్మానించడం జరిగింది.

ఇండియన్ వైద్య ఫెడరేషన్ జిల్లా యూత్ అధ్యక్షుడికి..

బచ్చన్నపేట: ఆర్య వైశ్య సంఘం, ఇండియన్ వైద్య ఫెడరేషన్ జిల్లా యూత్ అధ్యక్షుడిగా ఎన్నికైన మండల కేంద్రానికి చెందిన జిల్లా సందీప్ కుమార్‌ను పలువురు నాయకులు సన్మానించారు. గురువారం మండల కేంద్రంలో సందీప్‌కుమార్‌కు శాలువా కప్పి మరిన్ని పదవులను అలంకరించాలని కోరారు. సర్పంచ్ , ఎంపీటీసీ, నాయకులు ఉన్నారు.

పశుగ్రాసం సాగులో మెళకువలు పాటించాలి


మాట్లాడుతున్న మనోహర్

లింగాలఘణపురం: పశుగ్రాసం సాగులో పాడి రైతులు మెళకువలు పాటించాలని జిల్లా పశువైద్యాధికారి ఎస్‌ఎల్.మనోహర్ అన్నారు పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా గురువారం క్లోం గ్రామంలో ఏర్పాటు చేసిన అవగాహన కార్యక్రమంలో డాక్టర్ ఎస్.నేహా, మండల పశువైద్యాధికారి అనిత పాల్గొన్నారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ.. నిలువ గడ్డి తయారీ, చాఫ్‌కట్టర్ వినియోగంతో పశుగ్రాసం వృథాను అరికట్టవచ్చని చెప్పారు. కార్యక్రమంలో పశువైద్యులు డాక్టర్ భగవాన్‌రెడ్డి, పాల కేంద్రం చైర్మన్ శ్రీనివాసు, ఉప సర్పంచ్ మల్లేశం, నాయకులు సత్తయ్య, రైతులు పరశురాములు, రాజు పాల్గొన్నారు.

ఇంటింటికి తిరిగి చెత్త సేకరించిన సర్పంచ్‌లు

జనగామ రూరల్/బచ్చన్నపేట: సమస్యల పరిష్కారం కోసం జీపీ కార్మికులు సమ్మె చేస్తున్నారు. దీంతో గ్రామాల్లో పారిశుద్ధ్యానికి ఆటంకం ఏర్పడుతోంది. కాగా, గ్రామాలు పరిశుభ్రంగా ఉండాలని గురువారం జనగామ, బచ్చన్నపేట మండలాల్లోని గానుగుపహాడ్, వంగసుదర్శన్‌నగర్ సర్పంచ్‌లు శానబోయిన శ్రీనివాస్, కోనేటి స్వామి గురువారం గ్రామాల్లో ఇంటింటికి తిరిగి స్వయంగా ట్రాక్టర్ నడిపి చెత్తను సేకరించారు.

ఆక్రమణకు గురవుతున్న ఎర్రకుంట

లింగాఘణపురం: మండలంలోని నెల్లుట్ల ఎర్రకుంటను సమీప రైతులు చదును చేసి ఆక్రమించి పొలాలుగా సాగు చేసుకుంటున్నారు. సర్వే నంబర్ 157లో 43.08 ఎకరాల విస్తీర్ణంలో ఎర్రకుంట ఉంది. అందులో కుంటను ఆనుకొని ఉన్న రైతులు గత కొన్ని రోజులుగా గుట్టు చప్పుడు కాకుండా కంప చెట్లను తొలగించి పొలాలు చేసి పైపులైన్లు కూడా వేసుకొని సాగుకు సిద్ధం చేశారు. ఇంత జరుగుతున్నప్పటికీ అటు నీటిపారుదల శాఖ, ఇటు రెవెన్యూ అధికారులు పట్టించుకోకపోవడం విడ్డూరంగా ఉంది. ఈ విషయంపై తహసీల్దార్ వినయలతను ఫోన్‌లో సంప్రదించేందుకు ప్రయత్నించగా ఫోన్ ఎత్తలేదు. నీటిపారుదల ఏఈ లక్ష్మయ్యను వివరణ కోరగా తన దృష్టికి రాలేదని పరిశీలించి చర్య తీసుకుంటామని చెప్పారు.


ఎర్రకుంటలో చదును చేసి వేసిన పైపులైన్

ఎర్రకుంటను కాపాడాలి..



ఎర్రకుంట కొంత కాలంగా ఆక్రమణకు గురవుతుంది. కంప చెట్లను తొలగించి పొలాలుగా అచ్చుకడుతున్నారు. అధికారులు ఎవరు పట్టించుకోవడంలేదు. ఇప్పటికైన సంబంధిత రెవెన్యూ అధికారులు కుంట భూమి ఆక్రమణకు గురి కాకుండా కాపాలి.

– ఉప్పలయ్య, రైతు

దళారీ వ్యవస్థను రూపుమాపాలి

- ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం



మాట్లాడుతున్న ధర్మభిక్షం

స్టేషన్‌ఘన్‌పూర్: జిల్లాలోని వివిధ ప్రభుత్వ శాఖల్లో అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవడంతోపాటు దళారీ వ్యవస్థను రూపుమాపాలని ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి ధర్మభిక్షం డిమాండ్ చేశారు. స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జిల్లా ఉపాధ్యక్షుడు యాకన్న అధ్యక్షతన గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ఇవ్వాల్సిన యూనిఫామ్‌ను కమిషన్ల కోసం అధికారులు ఆలస్యం చేశారని, కలెక్టర్ తక్షణమే స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. పలు కార్యాలయాల్లో అవినీతిపై ఫిర్యాదు చేసినా ఉన్నతాధికారులు స్పందించడంలేదని అన్నారు. కార్యక్రమంలో నాయకులు వికాస్, జాదవ్, మహేష్, సంతోష్, రవితేజ, మహనోర్, వంశీ పాల్గొన్నారు.

బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు స్థల పరిశీలన

లింగాలఘణపురం: నవాబుపేట అంగడిలో ప్రయోగాత్మకంగా కమ్యూనిటీ బయోగ్యాస్ ప్లాంట్ ఏర్పాటుకు గురువారం డీఆర్‌డీఓ రాంరెడ్డి, డీపీఓ రంగాచారి స్థలాన్ని పరిశీలించారు. అంగడికి వచ్చే పశువుల పేడతో బయోగ్యాస్ తయారు చేసి కమ్యూనిటీ ప్రజలకు పంపిణీ చేసేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని వారు తెలిపారు. సర్పంచ్ జయ రాజేశ్వర్, ఎస్‌బీఎం కరుణాకర్‌తోపాటు తదితరులు ఉన్నారు.


ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం


కొడకండ్ల: మొండ్రాయి సబ్‌స్టేషన్ వద్ద రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనంలో ఎంపీపీ జ్యోతి

రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్ అవసరం లేదని వ్యాఖ్యలు చేసిన టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి రైతులకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బీఆర్‌ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జిల్లా వ్యాప్తంగా బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సబ్ స్టేషన్ల వద్ద ఆందోళన నిర్వహించి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఆయా కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

– కొడకండ్ల/దేవరుప్పుల/పాలకుర్తిటౌన్


పాలకుర్తి టౌన్ సబ్‌స్టేషన్ ఎదుట..


దేవరుప్పుల: కడవెండి విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదుట..

కార్యకర్తల కుటుంబాలకు అండ


చెక్కు అందజేస్తున్న చంద్రారెడ్డి

బచ్చన్నపేట: ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యకర్తల కుటుంబాలకు అండగా ఉంటున్నారని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు బొడిగం చంద్రారెడ్డి అన్నారు. గురువారం మండల కేంద్రంలో మండలంలోని బసిరెడ్డిపల్లికి చెందిన పార్టీ కార్యకర్త బండకింది నర్సింహులు మృతి చెందగా బాధిత కుటుంబ సభ్యులకు పార్టీ ఇన్సూరెన్స్ రూ.2 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సమన్వయ సమితి మండల కోఆర్డినేటర్ చల్ల శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌లు వడ్డెపల్లి మల్లారెడ్డి, గంగం సతీష్‌రెడ్డి, ఎంపీటీసీ కర్ణాల వేణుగోపాల్, నాయకులు బావండ్ల కృష్ణంరాజు, గంధమల్ల నరేందర్, షబ్బీర్ పాల్గొన్నారు.

కేసీఆర్‌కు గుణపాఠం చెప్పాలి

- టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల ఐలయ్యయాదవ్


మాట్లాడుతున్న ఐలయ్యయాదవ్

స్టేషన్‌ఘన్‌పూర్: ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా ప్రజలను దగా చేస్తూ నిరంకుశ పాలన సాగిస్తున్న సీఎం కేసీఆర్‌కు రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెప్పాలని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జక్కుల ఐలయ్యయాదవ్ అన్నారు. పార్టీ స్థానిక కార్యాలయంలో గురువారం నియోజకవర్గ ఇన్‌చార్జ్ రజనీకాంత్ అధ్యక్షతన ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులకు రుణమాఫీ చేస్తానని 5 శాతం మందికే చేశారని, పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వలేదని, నిరుద్యోగ భృతి ఊసే ఎత్తడం లేదని అన్నారు. గిరిజన, ముస్లింల రిజర్వేషన్, డబుల్ బెడ్రూం ఇళ్లు ఎవరికిచ్చారని ప్రశ్నించారు. యువతకు ఉపాధి కల్పనలో బీఆర్‌ఎస్ సర్కారు పూర్తిగా విఫలమైందని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పార్టీ వర్ధన్నపేట ఇన్‌చార్జ్ చాడ మరియసురేఖ, తెలుగునాడు ఉపాధ్యాయ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వెంకట్రాజ్యం, మాదిరెడ్డి ధర్మారెడ్డి, మేకల రమేష్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్ శిక్షణ ప్రారంభం

జనగామ రూరల్: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్‌లో గురువారం దుర్గాబాయి మహిళ శిశు వికాసం వరంగల్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ కార్యక్రమాన్ని సొసైటీ అధికారి పి.జయశ్రీ, శ్రీకల్ప సోషల్ సర్వీస్ సొసైటీ అధ్యక్షురాలు ఆలేటి కల్పలత ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతులు, మహిళలు స్వయం ఉపాధి కోసం టైలరింగ్ శిక్షణ తీసుకొని తమకాళ్లపై నిలబడి ఆర్థికంగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో హేమ, ట్రైనర్ రజిత తదితరులు పాల్గొన్నారు.